క్లుప్తంగా

నేడు బీఆర్‌ఎస్ బూత్ స్థాయి నాయకుల సమావేశం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో ఈనెల 6న బీఆర్‌ఎస్ బూత్ స్థాయి నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న హాజరవుతారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను దోస్త్ వెబ్‌సైట్ ద్వారా స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో ఈనెల 15 నుంచి 27వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బీఏ, బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్‌సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని.. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీగజ్జలమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ నిర్వహించారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్, ఇస్లాపూర్, శివుని, హిమాయత్‌నగర్ ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. చిన్నారులకు తలనీలాలు, తులాభారం(బంగారంతో) వేయించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

లోకేశ్వరం: మండలంలోని హవర్గా, హథ్‌గాం, కిష్టాపూర్, లోకేశ్వరం గ్రామాల తాజా మాజీ సర్పంచులు భుజంగ్‌రావు, భీంరావు, శైలజ, దార్వడి సౌజన్య బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు భుజంగ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో ఏయే పార్టీలో చేరేది వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు.


నూతన కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని ఆరోవార్డు పరిధిలో ఉన్న బర్కత్‌పుర వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్దుల్‌జావీద్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ జియా, కోశాధికారిగా రిజ్వాన్ ఖాన్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ గనీ, కార్యదర్శిగా షాకీర్, కార్యవర్గ సభ్యులుగా షబ్బీర్, రషీద్‌ఖాన్ ఎన్నికయ్యారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు చేయాలి

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్రబాబు, రమణారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖానాపూర్‌లో కేంద్రం ఏర్పాటు చేస్తే నాలుగు మండలాల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే వారు ఎండ తీవ్రతతో ఉట్నూర్ వెళ్లలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా మండలాధ్యక్షురాలిగా స్వప్న



కుంటాల: బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా కుంటాలకు చెందిన వంగెర స్వప్నను నియమించినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపల్లి గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు స్వప్న కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

వైద్యశిబిరం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు నరేశ్

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో ఆదివారం భైంసా అరోష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పిడియాట్రిక్ డాక్టర్ నరేశ్ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరిశుభ్రత, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్నారులను ఎండలోకి వెళ్లకుండా చూడాలని తల్లులకు సూచించారు. మాజీ సర్పంచ్ గోపా సాయినాథ్, వీడీసీ అధ్యక్షుడు గంగాదర్, రాజేశ్వర్, డాక్టర్ బాబయ్య, దేవిదాస్, మౌలాఖాన్, శివకుమార్ పాల్గొన్నారు.

వరి కోత.. రైతులకు మోత



పొట్టపెల్లి సమీపంలో వరి కోస్తున్న హార్వెస్టర్

- భారీగా పెరిగిన హార్వెస్టర్ల కిరాయి
- తడిసిమోపెడవుతున్న ఖర్చులు
- నష్టపోతున్న అన్నదాతలు

లక్ష్మణచాంద: దుక్కి దున్నడం మొదలుకొని.. పంట చేతికొచ్చే వరకు ఆరుగాలం శ్రమించే రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఈసారి యాసంగిలో సాగు చేసిన వరి పంటను ఓవైపు తెగుళ్లు.. మరోవైపు వడగండ్ల వానలు దెబ్బతీశాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా వరికోతలు జోరందుకోగా యంత్రాల(హార్వెస్టర్ల) అద్దెధరలు పెరిగాయి. పంటను కల్లాలకు, కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు రవాణా చార్జీలు సైతం తడిసి మోపెడవుతున్నాయి. డీజిల్ ధరలను సాకుగా చూపి ట్రాక్టర్లు, హార్వెస్టర్ల యజమానులు సైతం ధరలను పెంచుతున్నారని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం డీజిల్ ధర రూ.97.09 ఉండగా హార్వెస్టర్ల ధరలు గంటకు రూ.1800 నుంచి రూ.2000 వరకు ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అదే ఫోర్ వీలర్ అయితే గంటకు రూ.2800 ఉన్నట్లు పేర్కొంటున్నారు.

జిల్లాలో 75వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈ యాసంగిలో 75 వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. గత వానాకాలం కంటే గంటకు హార్వెస్టర్ యజమానులు రూ.200 అదనంగా పెంచినట్లు రైతులు తెలుపుతున్నారు. ఇదిలా ఉంటే పంట కోసిన తర్వాత ధాన్యాన్ని పొలాల నుంచి కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించేందుకు గతంలో ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.300 నుంచి రూ.350 తీసుకునేవారు. కానీ ప్రస్తుతం ట్రిప్పుకు రూ.400 నుంచి రూ.500 వరకు పెంచినట్లు రైతులు తెలుపుతున్నారు. ఎకరం పొలం కోసేందుకు 60 నుంచి 80 నిమిషాలు పడుతుండగా.. హార్వెస్టర్ ఖర్చు రూ.2660, ట్రాక్టర్ కిరాయి రెండు ట్రిప్పులకు గానూ రూ.వెయ్యి, ఇలా ఎకరంలో పంట కొనుగోలు కేంద్రం చేరే వరకు రూ.3660 లకు పైగా ఖర్చవుతున్నట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు.

లాభం లేదంటున్న యజమానులు..

డీజిల్ ధరలను సాకుగా చూపి హార్వెస్టర్ యజమానులు ధరలు పెంచారని రైతులు పేర్కొంటే.. తమకు గిట్టుబాటు కావడం లేదని హార్వెస్టర్, ట్రాక్టర్ యజమానులు బాధపడుతున్నారు. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.97.09 ఉంది. హార్వెస్టర్ గంట నడిచేందుకు 6 నుంచి 7 లీటర్ల డీజిల్ అవసరం. దీనికి తోడు హార్వెస్టర్ డ్రైవర్‌కు నెలకు రూ.45వేలు, క్లీనర్‌కు నెలకు రూ.10వేల జీతం.. ఇద్దరికి భోజన ఖర్చులు, యంత్రంలో ఏ చిన్న పరికరం దెబ్బతిన్నా..దాన్ని కొనాలంటే రూ.వేలు ఖర్చవుతుందని ఇవన్నీ కలుపుకొంటే తమకు ఏం మిగలడం లేదని పలువురు హార్వెస్టర్ల యజమానులు పేర్కొంటున్నారు.

రైతులపై అదనపు భారం



గతంలో హార్వెస్టర్‌కు గంటకు రూ.1800 ఉండేది. కాని ఇప్పుడు రూ.2వేలు, ఫోర్ వీలర్ అయితే గంటకు రూ.2800 ఉంది. ట్రాక్టర్‌లో ధాన్యం తరలించేందుకు అదనంగా రూ.400 అవుతున్నాయి. ఈసారి తెగుళ్ల సోకడంతో పంట దెబ్బతింది. ఈసారి దిగుబడులు కూడా తక్కువ వచ్చేలా ఉన్నాయి.

– శ్రీనివాస్, రైతు, లక్ష్మణచాంద

ధరలు తగ్గించాలి



గతంలో కంటే హార్వెస్టర్ ధరలు పెరగడంతో రైతులు నష్టపోతున్నారు. కొంచెం ధరలు తగ్గించాలని కోరుతున్నాం. ఈసారి ఎకరాకు పెట్టుబడి రూ.30వేలయ్యాయి. పంటను తెగుళ్ల ఆశించడంతో దిగుబడి కూడా బాగా తగ్గింది. రూ.40 వేల కంటే ఎక్కువ ఆదాయం వచ్చేలా లేదు. కొందరికీ పెట్టుబడులు కూడా వచ్చేది అనుమానమే.

– ముత్తన్న, పీచర

మాకు ఏం మిగుల్తలేవ్.

గతంలో కంటే ఇప్పుడు డ్రైవర్లకు, సహాయకులకు జీతాలు ఎక్కువ ఉన్నాయి. ఇద్దరికి కలిపి నెలకు రూ.55,000..భోజన ఖర్చులు అదనం. మరోవైపు డీజిల్ ధరలు కూడా పెరిగాయి. ఎండకు డీజిల్ ఆవిరి అవుతుంది. మాకు కూడా ఏం మిగుల్తవేవ్.

– చిన్నారెడ్డి, హార్వెస్టర్ యజమాని

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్
- గ్రామాల్లో నాయకుల ప్రచారం



భైంసాలో దశరథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే



నిర్మల్‌చైన్‌గేట్ : ప్రచారం చేస్తున్న నాయకులు



ఖానాపూర్: శ్రీరాంనగర్‌లో ప్రచారం చేస్తున్న రతీశ్ రాథోడ్, నాయకులు



ముధోల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

భైంసాటౌన్: బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన అందెల్‌వార్ దశరథ్ పట్టణ కమిటీలో కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎస్ఎస్ కాటన్‌లో శాలువాతో సత్కరించారు. మోదీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రజలను ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణ్‌రెడ్డి, తూమోల్ల దత్తాత్రి ఉన్నారు.

భైంసా పట్టణంలోని బ్రాహ్మణ్‌గల్లి, మార్వాడి గల్లిలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బి.గంగాధర్ నేతృత్వంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నగేశ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, కౌన్సిలర్ దశరథ్, పోశెట్టి, సాహెబ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని నాయుడువాడ, గాంధీచౌక్ ప్రాంతాల్లో ఆదివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. బీజేవైఎం పట్టణాధ్యక్షుడు పొలాస భరత్, ప్రమోద్, దివాకర్, భరత్, రాకేశ్, సుమంత్, కిరణ్, వినోద్, రిషి పాల్గొన్నారు.

లోకేశ్వరం: ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ముధోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని రాజూర గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ గ్యారంటీలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నల్ల రమేశ్, గోపి, సరస్వతి, సాయినాథ్ పటేల్ ఉన్నారు.

రిజర్వేషన్ల రద్దు పేరిట దుష్ప్రచారం

ఖానాపూర్: బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు రితీశ్ రాథోడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీరాంనగర్‌లో బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వ పథకా ల ను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అంకం మహేందర్, నాయిని సంతోష్, ఆకుల శ్రీనివాస్, నల్ల రవీందర్‌రెడ్డి, బి.మల్లయ్య, సత్యవతి, శ్రీనివాస్, రమేశ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. జనార్దన్ తదితరులు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని కోరారు.

కుంటాల: మండలంలోని అంబకంటి, మెదన్‌పూర్, సూర్యాపూర్, కుంటాల గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ నర్సయ్య, వెంగల్‌రావు, కార్యదర్శి సూర్య వంశీ, వెంకన్న, ముక్తేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



ఖానాపూర్ నుంచి వెళ్తున్న ఎమ్మెల్యే బొజ్జు,నేతలు



కడెం: రాహుల్‌గాంధీ సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



లోకేశ్వరం: పుస్పూర్ నుంచి వెళ్తున్న కార్యకర్తలు



సోన్: కడ్తాల్ నుంచి బయలుదేరిన నాయకులు

ఖానాపూర్: జిల్లాకేంద్రంలోని జనజాతర సభకు కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల నుంచి నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్‌చైర్మన్ సంతోష్, మండలాధ్యక్షుడు దయానంద్, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేశ్ తదితరులు వెళ్లారు.

కడెం: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రాహుల్ గాంధీ సభకు కడెం, దస్తురాబాద్ మండలాల్లోని కాంగ్రెస్ నాయకులు వాహనాల్లో నిర్మల్ బయలుదేరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, వెంకటేశ్, రమేశ్, శంకర్ తదితరులున్నారు.

సోన్: జిల్లా కేంద్రంలోని క్రషర్‌గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని గ్రామాల కాంగ్రెస్ నేతలు ప్రత్యేక వాహనాల్లో నిర్మల్ సభకు తరలివెళ్లారు. మాజీ జెడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, భోజారాం పటేల్, తూర్పాటి వెంకటేశ్, బుచ్చన్న, లక్ష్మణ్, అశోక్ రెడ్డి, మహేందర్, బక్కయ్య, యూనిస్ వెళ్లారు.

లోకేశ్వరం: నిర్మల్‌లో నిర్వహించిన జనజాతర సభకు ఆదివారం మండలంలోని పుస్పూర్, హవర్గ, మన్మద్, రాజూర, గడ్‌చాంద, పంచగుడి, ధర్మోర, రాయపూర్, పుస్పూర్ గ్రామాల కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. ఆ పార్టీ మండల కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి, సంగెం నర్సన్న, మామిడి నారాయణ్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

‘న్యాయవాదుల పరిరక్షణ చట్టం తేవాలి’



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్

ఖానాపూర్: న్యాయవాదులపై జరిగే దాడులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ చట్టం తేవాలని ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన న్యాయవాది వెంకట్ మహేంద్రపై భౌతికదాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పోలీసులు స్పందించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా సోమవారం తామంతా విధులు బహిష్కరిస్తామన్నారు. అనంతరం వెంకటమహేంద్రను తన నివాసంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పరామర్శించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో పలువురు న్యాయవాదులు నేరెళ్ల సత్యనారాయణ, పి.రాజగంగన్న, కిశోర్ నాయక్, రాజశేఖర్, రాఘవేంద్ర, వినయ్, వేణుగోపాల్, రవి, పరమేశ్వర్, రామునాయక్, సుమన్ తదితరులు ఉన్నారు.

మీరాతాయి అంబేద్కర్ జన్మదిన వేడుకలు

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీనగర్, రాహుల్‌నగర్ మైత్రేయ బుద్ధవిహార్‌లో బౌద్ధ ఉపాసిక మీ రా తా యి అంబేద్కర్ 89వ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసాశాఖ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కోడలు అయిన మీరాతాయి సామాజిక సేవ కార్యక్రమాలతోపాటు బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ సంరక్షురాలిగా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పని చేయాలని ఆమె పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఎస్ఐ నాయకులు రాహుల్ జోందలే, ఏక్‌నాథ్, దమ్మానంద్, అక్షయ్, సోమాజీ, బౌద్ధ ఉపాసకులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి సక్కు, నేతలు

నిర్మల్‌టౌన్: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని..కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గాంధీ కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. 100 రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్ రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, నాయకులు డాక్టర్ సుభాశ్‌రావు, లక్ష్మణాచారి, నెల్ల అనిల్, విశాల్, హరీశ్, పూదరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన.. ఇలాగేనా..!



నిర్మల్ చౌరస్తాలో తక్కువ ఎత్తులో ప్రచార ఫ్లెక్సీ



ఐబీ వద్ద ఒకే చోట నామమాత్రంగా ఏర్పాటు చేసిన రెండు ప్రచార ఫ్లెక్సీలు

భైంసాటౌన్: పారదర్శక ఎన్నికల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేసే సీ–విజిల్ యాప్ గురించి ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. కానీ భైంసా పట్టణంలోని నిర్మల్ చౌరస్తాలో ఓ ప్రైవేట్ ఫ్లెక్సీ అందరికీ కనిపించేలా కర్రలతో ఏర్పాటు చేశారు. కానీ పక్కన సీ–విజిల్ యాప్ ప్రచార ఫ్లెక్సీని మాత్రం అధికారులు ఇలా మొక్కల ఫెన్సింగ్‌కు కట్టేశారు. అలాగే స్థానిక ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ప్రాంతంలో ఒకే చోట రెండు ప్రచార ఫ్లెక్సీలను ఇలా తూతూమంత్రంగా ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. ఎన్నికల సంఘం ఓటర్లకు అవగాహన కల్పించే ప్రచారానికి నిధులు విడుదల చేస్తున్నా.. సిబ్బంది వాటిని సరిగా వినియోగించడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సుర్రుమంటున్న సూర్యుడు



నిర్మానుష్యంగా శివాజీచౌక్ చౌరస్తా

ఉదయం 9 గంటల నుంచే భానుడు ఉగ్రరూపం దాలుస్తుండటంతో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. సూర్యుడి ప్రతాపానికి జిల్లా కేంద్రంలో రద్దీగా ఉండే రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. మే మొదటి వారంలోనే 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జిల్లావాసులు భయాందోళనకు గురవుతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





ఎండ నుంచి రక్షణ పొందేందుకు స్కార్ఫ్, కొంగు కప్పుకున్న మహిళలు

పరామర్శ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు అంకం రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని కవి యాత్ర అధ్యక్షుడు శ్రీకారం శంకర్, కమిటీ సభ్యుడు పురుషోత్తంరావు పరామర్శించారు.